

# అతను-ఆమె

కురుమద్దాలి విజయలక్ష్మి

ట్రైన్ కదలటానికి సిద్ధంగా ఉంది.

గార్డ్ పచ్చజెండా ఊపి విజిల్ వేశాడు.

ట్రైన్ కదిలింది, రాక్షసిలా కూత పెట్టి.

పరుగెత్తుతూ యిరువురు వ్యక్తులు ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ వైపు వచ్చారు.

సూట్‌కేసుతో ఒకతను కంపార్ట్‌మెంట్‌లో కాలుపెట్టాడు.

రెండో అతను కిందనే ఆగిపొయ్యాడు.

"చెబితే వినకుండా ఒంటరిగా

వెళుతూ లక్షరూపాయలు తీసుకెళు తున్నావు. జాగ్రత్త. సూట్‌కేస్ వడిలోనే పెట్టుకో. వెళ్ళగానే టెలిగ్రాం యివ్వు."

కదులుతున్న ట్రైన్‌తోపాటు పరుగులాటి నడకతో ప్లాట్‌ఫామ్ మీదనుండి రెండో అతను పెద్ద గొంతుతో చెపుతున్నాడు. అరచినట్లే ఉంది అతని కంఠం.

అన్నింటికీ చిరునవ్వుతో మొదటి అతను తల వూపి ఊరుకున్నాడు.

ట్రైన్ స్పీడందుకుని స్టేషన్ దాటింది.

ఓ చేతిలో సూట్‌కేసు మరో చేతితో గాలిలో వీడ్కోలు ఇచ్చి కంపార్ట్‌మెంట్ తలుపులువేసి వెనుతిరిగాడు అతను.

అతని పేరు రామారావు.

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ ఖాళీగా ఉంది. ఓ ముస్లిం స్త్రీమాత్రం ఓ మూలగా సీటుకి అతుక్కుపోయి కూర్చుని ఉంది.

రామారావుని చూచి బురఖా సవరించుకొని ముడుచుకూర్చుంది.

రామారావు ఆమె నోసారి చూచి కిటికీ దగ్గరగా ఉన్న సీట్లో కూర్చున్నాడు.

సూట్‌కేస్ బెర్త్‌మీద పెట్టక ఒడిలో పెట్టుకుని రెండుచేతులూ దాని మీదవేసి కూర్చున్నాడు రామారావు.

కిటికీలోంచి బయటకు చూస్తున్న రామారావు ఒకటి రెండుసార్లు తల తిప్పి ఆమెవైపు చూసాడు. వెంటనే చూపు మళ్ళించేసాడు.

రామారావు చూచినప్పుడల్లా ఆమె చూపు మరల్చుకుంటున్నది.

రామారావు గమనించాడు, ఆమె తనని చాలా పరిశీలనగా చూస్తున్నదని.

ఈతఫా తీవ్రంగా 'నీవు స్త్రీవి కావా ? సిగ్గు లేదా ? పుట్టింది ఘోషా కుటుంబంలో కాదా ? ముస్లిం వనితకు యిది తగునా ?' అన్నట్లు రామారావు ఆమెవైపు చూచాడు.

ఆమెకూడా ఈ తఫా నిర్లక్ష్యంగా, కళ్ళార్పకుండా, నీవంటే నాకేం లెక్క లేదు అన్నట్లు చూచింది.

రామారావు ఆశ్చర్యపోయాడు.

ఆమె చూపులు తనమీద, తన ఒడిలో పెట్టెమీద ఉండడం చూచి కంగారుపడ్డాడు. పెట్టెని గట్టిగా పట్టుకున్నాడు.

"ఏయ్. మిష్టర్, నీ పేరేమిటి ?" అంది ఆమె కూర్చున్న చోటునుండి కదలకుండ.

రామారావు మాట్లాడలేదు.

"నీకేంచెముడా?" అడిగింది. "వినపడలేదా ?" లేచి నుంచుని దబాయింపుగా అంది ఆమె.

రామారావు ఆమె పెదవులవైపు చూస్తూ ఉండిపొయ్యాడు.

"నీకు చాలాగీర ఉన్నట్లుందే! నీ చేతిలో సూట్ కేస్ మర్యాదగా నా కిస్తావా లేక ఆపదలో పడతావా?" అంటూ బురఖా విసిరి సీటుమీద కొట్టింది.

ఆమె వయసు పాతిక మించి, ఉండవ్ ఆమె అందం అప్సరసను పోలి ఉంది.

ఆమె రామారావు దగ్గరకు వచ్చి పెద్దగా చెప్పింది తనకా సూట్ కేస్ ఇమ్మని, లేకపోతే ఆపదలో పడతావని. అప్పుడు ఆమె ముఖం రౌద్రంగా ఉంది.

రామారావు అయోమయంగా చూసాడు. జేబులోంచి కలము, కాగితము తీశాడు. గబగబ నాలుగు ముక్కలు గీకి, కాగితం ఆమె చేతిలో పెట్టాడు.

"మేడమ్,

మీ పేరేమిటో తెలియదు. పెదవుల కదలికబట్టి నేను ఎదుటివారి మాటలు కొన్ని గ్రహించగలను. మీరు ఎందుకనో నన్ను కోప్పడుతున్నారు. వంటరిగా మీరు ఈ కంపార్ట్ మెంట్ లో ఉంటే మగాడిని నే నెక్కాననా? మీరు ఒంటరిగా పెట్టెలో ఉండటం నా నేరంకాదు. నేనూ టిక్కట్టు కొనే ఎక్కాను. నాకు మాటలు రావు. పైగా చెముడు. ఇదంతా నా ప్రారబ్ధం, దయచేసి నన్నర్ధం చేసుకోండి. నావల్ల మీకేమీ అపకారం జరగదు. మీరేమన్నా చెప్పదలచుకుంటే ఈ కాగితంమీద రాసి చూపండి.

రామం.

ఆమె చదివింది. రామారావువైపు అనుమానంగా చూచింది. రామారావు బాటసారి ఫోజులో అమాయకంగా ఆమెనే చూస్తున్నాడు. ఆమె రామం చేతిలోని కలంతీసుకుంది. తనూ నాలుగు ముక్కలు గీకి కాగితం చేతిలో పెట్టింది.

రామారావు ఆమె రాసింది చదివాడు. భయపడుతూ చూసాడు ఆమెవైపు.

"మిష్టర్,

నా పేరు రమోలా. నేనో ప్రముఖ రైలు ప్రయాణీకుల పాలిట దొంగని. దొంగతనాలు చేయటం, మోసం చేయటం నా వృత్తి. అవసరమయితే హత్యలు చేయటానికికూడా వెనుకాడను. నా వెనుక పెద్ద గ్యాంగ్ ఉంది. ఇహ అసలు విషయం. నీ వద్దనున్న సూట్ కేసులో లక్షరూపాయలు ఉన్నాయే, అవి నా కివ్వు. లేకపోతే ఏంచేస్తానో తెలుసా! నెక్ట్సు స్టేషన్ వచ్చేటప్పటికి నా రూపం మారిపోతుంది. నన్ను నీవు రేప్ చేశావని చెప్పి నలుగురినీ పిలిచి గోలచేస్తాను. అందరూ నమ్ముతారు. నిన్ను పట్టుకు తంతారు. ఆపెట్టె నాదని చెప్పి తీసుకెళతాను. నెక్ట్సు స్టేషన్‌లో నావాళ్ళుంటారు. నాకేం భయంలేదు. సాయంచేస్తారు. ఏమంటావ్? నీవేదన్నా చెబుదామన్నా మాటలురావు. నీ మాట నమ్మరు.

రమోలా.

రామారావు ఒకసారి, రెండు,

మూడు, నాలుగుసార్లు చదివాడు. ముందు భయంగా ఆమెవైపు చూసాడు. ఆ తర్వాత కోపంగా చూచి కాగితం నలిపి విసిరి రమోలావైపు కొట్టాడు. పెట్టె గట్టిగా పట్టుకుని నీ ఇష్టం. ఏమన్నా చేసుకో అన్నట్లు నిర్లక్ష్యంగా తల ఎగరవేసి ముఖం పక్కకు తిప్పేసుకున్నాడు.

రమోలా కోపంతో ఊగిపోయింది. తను కొన్ని వందల దొంగతనాలు చేసింది. ఇంతవరకు ఎవరూ తనను పట్టుకోలేదు. తను పదిమంది రౌడీలను కూడా పోషిస్తున్నది. ఈ చెముడు, మూగ వెధవ తన మాట వినడా ? పైగా కాగితం ఉండలాచేసి ముఖాన కొడతాడా ? ఎంత ధైర్యం, ఎంత పొగరు ?

రమోలా చేతిగాజులు పగలకొట్టుకుని కంపార్ట్‌మెంట్ అంతా విరజల్లింది. జుట్టు పీక్కుంది. రవిక భుజంవద్ద పర్రున చించుకుంది. చీర ఊడితే దోపుకున్నట్లు అస్తావ్యస్తంగా దోపుకుంది. పెదవి గంటుపడేటట్టు కొరుక్కుంది. గోళ్ళతో బుగ్గలమీద, కంఠంమీద గీరుకుంది. 'ఇప్పుడు చూడు నా రూపం, రేప్‌చేసిన యువతిలా ఉన్నాను. నీ కర్మ దగ్గరపడింది", అన్నట్లు రామారావు దగ్గరగా వచ్చి చూపింది తన అవతారం.

రామారావు ఒడిలో పెట్టె దగ్గరగా హత్తుకుని కళ్ళుమూసుకున్నాడు జరిగేది జరగక మానదు అన్నట్లు.

మరో పదినిమిషాలలో స్టేషన్ రానుంది. రమోలా గబుక్కున రామారావు చేతులపై తన పదునైన గోళ్ళతో గీసి, జుట్టు (క్రాపు) చెరిపేసింది.

రామారావు గింజుకున్నాడు.

స్టేషన్‌లో రైలు ఆగింది.

రమోలా "రక్షించండి, రక్షించండి", అని పెద్దగా కేకలు వేసింది.

అంతవరకూ ముడుచుకునినెమ్మదిగా కూర్చున్న రామారావు చివ్వున చెయ్యి చాచి రమోలా ముఖం పగిలేటట్టు ఒక్క దెబ్బవేశాడు.

రమోలా కళ్ళు బైర్లు కమ్మాయి.

రామారావు సూట్‌కేసు పక్కనపెట్టి రమోలా రెక్కలు విరిచి గట్టిగా ఉడుంపట్టుపట్టాడు. అలాగే కంపార్ట్‌మెంట్ నుంచి కిందకు ఒక్క లాగు లాగి దించాడు.

రమోలా తెప్పరిల్లి వెంటనే కేకలేయటం మొదలుపెట్టింది.

స్టేషన్‌లో సగంమంది జనం రామారావు, రమోలాల చుట్టూ మూగారు.

మరోసారి రామారావు చేతిలో రమోలా ముఖం పగిలింది.

"ఎందుకయ్యా ఆమెనలా కొట్టావు ?" ఎవరో ఒకాయన అడిగాడు.

రమోలా ఏదో చెప్పబోయింది, రామారావు ఆమె నోరు ఓ చేత్తో గట్టిగా

మూసి, మరో చేత్తో పారిపోకుండా పట్టుకున్నాడు.

"కంపార్ట్‌మెంట్‌లో సీటుపక్కన కాగితంఉండ వుంది. అర్జంటుగా తీసుకు రండి.'' రామారావు చెప్పగానే ఓ పద్దెనిమిదేళ్ళ కుర్రాడు పెట్టెలోకెక్కి కాగితం ఉండ తెచ్చాడు.

"కాగితం సరిచేసి చదవండి."

కాగితం తెచ్చినబ్బాయి కాగితం ఉండని సరిచేశాడు. ముందు రామారావు రాసింది, దానికింద రమోలా రాసింది పెద్దగా చదివాడు.

"అయ్యా! అందరూ విన్నారుగా? మా మామయ్యకి చాదస్తం. పొలాలమ్మిన డబ్బు లక్షరూపాయలు నాచేత పంపుతున్నాడు. ఆ డబ్బు జాగ్రత్త అని పరుగెత్తుతున్న రైలుతోపాటు తానూ పరుగెత్తుతూ నాకు వినపడుతుందో లేదో అని పెద్ద గొంతుకతో చెప్పాడు. ఈమె వింది. బెదిరించి నా వద్ద ఉన్న డబ్బు తీసుకుందామనుకుంది. మొదట చూడగానే ఈమె ముస్లిం వనిత కాదని, మోసగత్తె అని అనుమానం వేసింది. ఈ మధ్య నాకు చిన్న ఆపరేషన్ జరిగింది కంఠం పక్కన. డాక్టర్ ఎంతో అవసరం అయితే తప్ప మాట్లాడవద్దని చెప్పాడు. ఆమె ఎప్పుడయితే బురఖా విసిరేసి, నన్ను పిలిచిందో అప్పుడు గ్రహించాను, డబ్బుకోసం ఆమె బెదిరించబోతున్నదని. ఎత్తుకు పైఎత్తు వేసి కాగితంమీద స్వయంగా ఆమెచేతనే రాయించాను. ఇదీ జరిగింది". రామారావు చెప్పాడు, ఆశ్చర్యంగా వింటున్న వారితో.

స్టేషన్ మాస్టర్, స్టేషన్ పోలీస్ రమోలాని బంధించారు. రామారావు తన అడ్రెస్ ఇచ్చి రైలెక్కాడు.

రైలు కదులుతుండగా ప్లాట్‌ఫామ్ మీద ఉన్నవారితో రామారావు అన్నాడు.

"ఓ...నే నెవరో చెప్పలేదు కదూ? ఆపరేషన్ చేయించుకోటంవల్ల ఓ నెల శలవుపెట్టి మా మామయ్య ఇంట్లో విశ్రాంతి తీసుకుని బయలుదేరాను డ్యూటీలో చేరటానికి. నా ఉద్యోగం పోలీస్ ఇన్‌స్పెక్టర్."

